రూ.600 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్

దేశంలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ తెలంగాణ సొంతం. బంజారాహిల్స్‌లోని ఈ అద్భుతమైన పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో లక్ష కెమెరాల ఫుటేజీని ఒక్క నిమిషంలోనే పరిశీలించే ఆధునిక పరికరాలు, పరిజ్ఞానం అందుబాటులో ఉన్నాయి. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్‌ను)ను, ఇంటర్ ఆపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్) అనుసంధానించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. దేశంలోనే ఆటోమేటెడ్ ఫింగర్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఎఫ్ఐఎస్)ను కొనుగోలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణే. పోలీస్‌శాఖ చర్యల ఫలితంగా స్వలాభం కోసం జరిగే హత్యలు 32.94 శాతం తగ్గాయి. మొత్తంగా 19.42 శాతం హత్యలు తగ్గగా, మహిళలపై జరిగే నేరాల్లో 40 శాతం వరకు తగ్గుముఖం పట్టాయి. తెలంగాణ రాష్ట్ర పోలీసులు గత పదేండ్లలో 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్నారు.

తెలంగాణ పోలీస్ నం. 1

పదేండ్లలో మత ఘర్షణలు లేని రాష్ట్రంగా రికార్డు.. 11.10 లక్షల సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా వ్యవస్థ

పదేండ్లు అల్లర్లు, మతఘర్షణలు లేకుండా తెలంగాణ శాంతిభద్రతల నిలయంగా పరిఢవిల్లింది. ఫలితంగా పెట్టుబడుల వరద పారింది. ఏటా పోలీసు వ్యవస్థకు ఆర్థిక తోడ్పాటును అందిస్తూ, అత్యాధునిక సౌకర్యాలు కల్పించటంతో తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

- నార్కోటిక్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోల ఏర్పాటు
- హైటెక్‌గా జిల్లా పోలీస్ కేంద్రాలు, పోలీస్‌స్టేషన్లు
- దేశానికి ఆదర్శంగా నిలిచిన 'ఉమెన్ సేఫ్టీ వింగ్'

పదేండ్లలో 45,800 పోలీస్ ఉద్యోగాలు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): పదేండ్ల తెలంగాణలో పోలీస్ శాఖది చెరగని ముద్ర. శాంతిభద్రతలకు, మతసామరస్యాలకు తెలంగాణ నిలయంగా మారిందంటే కారణం.. మన అంతర్గత రక్షణ వ్యవస్థ పటిష్టంగా ఉండటమే. ఉమ్మడి పాలనలో అస్తవ్యస్తంగా ఉన్న పోలీస్ వ్యవస్థను కేసీఆర్ సర్కారు గాడిలో పెట్టింది. దేశానికే నంబర్ వన్ పోలీస్‌గా తీర్చిదిద్దింది. ఇదే విషయాన్ని 'ఇండియా జస్టిస్ రిపోర్టు-2022', 'తెలంగాణ సోషియో ఎనకానమిక్స్ సర్వే-2023' కూడా కుండబద్దలు కొట్టాయి. ఇండియా జస్టిస్ రిపోర్టు-2022 సర్వేలో తొలిసారిగా తెలంగాణ పోలీస్‌శాఖ మొదటి ర్యాంకును సొంతం చేసుకొన్నది. 2019లో 11వ స్థానంలో, 2020లో 10వ ర్యాంకులో కొనసాగిన తెలంగాణ.. 2022లో ఒకేసారి 9 ర్యాంకులు ఎగబాకి తొలిస్థానానికి చేరుకొన్నది. తక్కువ ఖాళీలు, ఎక్కువ భర్తీలు, పోలీస్ వ్యవస్థ తలసరి వ్యయంలో పెరుగుదల, సిబ్బంది శిక్షణకు నిధుల ఖర్చు, అత్యాధునిక పోలీస్‌స్టేషన్లు, కేటాయించిన నిధులు, మహిళా పోలీస్‌సిబ్బంది, పోలీసు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్ అమలు, బడ్జెట్ కేటాయింపులు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే గస్తీ, సీసీ కెమెరాల నిర్వహణ, పోలీస్‌స్టేషన్లలో ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లు, పోలీసులకు సమర్థవంతమైన శిక్షణ, పోస్టుల భర్తీల్లో పారదర్శకత వంటి అంశాలు తెలంగాణ పోలీస్ వ్యవస్థను దేశానికి ఆదర్శంగా నిలిపాయి. జైళ్ల నిర్వహణలో సైతం జాతీయ స్థాయిలో తెలంగాణ మూడోస్థానంలో నిలిచింది. బాధితులకు సత్వర న్యాయాన్ని అందించటంలో 5వ స్థానంలో ఉన్నది.

సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా

ఉమ్మడి పాలనలో తెలంగాణవ్యాప్తంగా లక్ష వరకు మాత్రమే సీసీ కెమెరాలు ఉండేవి. గత పదేండ్లలో తెలంగాణవ్యాప్తంగా 11.10 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 'స్టేట్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా-2023' ప్రకారం పోలీస్‌శాఖ ఆధీనంలో ఉన్న సీసీ కెమెరాల్లో తెలంగాణది మొదటిస్థానం. దేశంలోనే అత్యధికంగా సీసీ కెమెరాలున్న రాష్ట్రంగా అనతికాలంలోనే తెలంగాణ అవతరించింది. కాగా, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సీసీ కెమెరాలున్న టాప్-20 నగరాల్లో హైదరాబాద్ 16వ స్థానంలో నిలిచింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో నమోదవుతున్న కేసుల్లో 90 శాతం కేసులను సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఛేదిస్తున్నారంటే నిఘా వ్యవస్థను మన ప్రభుత్వం ఎంత పటిష్టంగా మార్చిందో అర్థం చేసుకోవచ్చు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటివి తెలంగాణ తర్వాతే ఉన్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో కల్తీలు, నకిలీలపై కఠినంగా వ్యవహరించి పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపేలా ఆర్డినెన్స్ తెచ్చిన తొలి రాష్ట్రం కూడా తెలంగాణే.

పదేండ్లలో 59,200 కోట్ల ఖర్చు

తెలంగాణకు పెట్టుబడులు రావాలంటే పోలీస్ వ్యవస్థను పటిష్టంగా మార్చాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. సీఎంగా కేసీఆర్ మొదటి సమావేశంలోనే పోలీస్ వ్యవస్థకు రూ.375 కోట్లు మంజూరు చేశారు. ఆ తర్వాత అదే పద్దు కింద మరో రూ.500 కోట్లు ఇప్పించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత 9 కమిషనరేట్లను ఏర్పాటు చేశారు. పోలీస్ సబ్‌డివిజన్ల సంఖ్యను 139 నుంచి 164కు, సర్కిళ్ల సంఖ్యను 688 నుంచి 719కు, పోలీస్‌స్టేషన్ల సంఖ్యను 712 నుంచి 815కు ప్రభుత్వం పెంచింది. రాష్ట్రం ఏర్పడేనాటికి పోలీస్‌శాఖకు 5 వేల వాహనాలుంటే, 2023 నాటికి 20 వేలకుపైగా వాహనాలు ఉన్నాయి. పదేండ్లలో పోలీస్ శాఖకు రూ.59,200 కోట్లను బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసింది.

సంస్కరణలకు పెద్దపీట

మహిళలు, పిల్లల పట్ల నేరాలు అరికట్టేందుకు, మానవ అక్రమ రవాణాను నివారించేందుకు దేశంలోనే తొలిసారిగా 'ఉమెన్ సేఫ్టీ వింగ్'ను కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసింది. దీని ద్వారా అన్ని జిల్లాల్లో షీటీమ్స్‌ను రంగంలోకి దించింది. సైబర్ నేరాల నియంత్రణకు 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో' ఏర్పాటు చేసింది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను అడ్డుకొనేందుకు 'తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో' ఏర్పాటు చేసింది.

9 ఏండ్లలోనే దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా తెలంగాణ పోలీస్ అవతరణ

పదేండ్లలో ఎక్కడా, ఎలాంటి మత ఘర్షణలు లేని రాష్ట్రంగా రికార్డు

మహిళలకు పోలీసు ఉద్యోగాల్లో **33.03%** రిజర్వేషన్లు

తెలంగాణలో **10.44** లక్షల మంది నేరస్థుల డాటాబేస్

పోలీస్ శాఖ నియామకాల్లో వయోపరిమితి మూడేండ్లకు పెంపు

వరుసగా నాలుగోసారి బెస్ట్ పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ అవార్డు

సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టు అమలులో **దేశంలోనే నంబర్ వన్**

2018లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు దేశంలోనే రెండో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా గుర్తింపు

2024లో దేశంలోనే 'బెస్ట్ పోలీస్ స్టేషన్'గా రాజేంద్ర నగర్ పీఎస్‌కు అవార్డు

డయల్ 100కు కాల్ చేస్తే 7 నిమిషాల్లోపే ఘటనాస్థలానికి పోలీసులు	హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఈ సమయం 5 నిమిషాలే	2023లో డయల్ 100కు సుమారు 16 లక్షల మంది ద్వారా ఫిర్యాదులు

అధునాతన పోలీస్ భవనాలు

తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 90 పోలీస్‌స్టేషన్లలో ఫ్రంట్ ఆఫీసుల నిర్మాణాన్ని కేసీఆర్ ప్రభుత్వం చేపట్టింది. ఆ తర్వాత ప్రతి మండలానికి ఒక పోలీస్‌స్టేషన్ ఉండాలన్న నిర్ణయంతో ఈ కార్పొరేషన్ సుమారు 137 కొత్త పోలీస్ స్టేషన్లకు భవనాల నిర్మాణం చేపట్టింది. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో 17 జిల్లా పోలీస్ అధికారుల కార్యాలయాల (డీపీవో)ను రూ.654.50 కోట్లతో నిర్మాణాలు చేపట్టింది. రూ.38.50 కోట్ల ఖర్చుతో అత్యాధునిక, సాంకేతిక వసతులతో ఒక్కో డీపీవోకు నిర్మిస్తున్నారు. కార్పొరేషన్ చేపట్టిన పోలీస్ భవనాలన్నీ 'స్మార్ట్ బిల్డింగ్స్' వ్యవస్థతో రూపొందించారు.

- 2023లో పోలీసుశాఖ ప్రధాన ఘట్టాలు
- 2023లో 41 శాతానికి పెరిగిన శిక్షల రేటు
- 60 శాతానికి తగ్గిపోయిన ఘోర రోడ్డు ప్రమాదాలు
- 11,10,994కు చేరిన సీసీ కెమెరాల సంఖ్య
- 2023 నాటికి 100 శాతం పెరిగిన పోలీస్ విజిబిలిటీ
- 175 మందిపై పీడీ యాక్ట్ నమోదు
- షీటీమ్స్, భరోసా కేంద్రాల ద్వారా 10,766 ఫిర్యాదుల స్వీకరణ
- తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పోలీస్ భరోసా కేంద్రాలు
- బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పోలీస్ నియామకాలకు క్లియరెన్స్.. 587 ఎస్సై, 15,750 కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ
- 294 ఎస్సైలకు సీఐలుగా, 280 మంది డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలు పదోన్నతి పొందారు. వీరితోపాటు 56 మందికి యాక్సెలరేటెడ్ ప్రమోషన్లు వచ్చాయి.
- తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్ మొదటి ర్యాంకులో నిలిచి ఐసీజేఎస్ 'ఫోరెన్సిక్ పిల్లర్' అవార్డును సొంతం చేసుకొన్నది.
- ఫింగర్ ప్రింట్ బ్యూరో పోలీసులు దేశంలోనే రెండో ర్యాంకు సాధించారు.
- భరోసా సెంటర్లు, ఈ-చలాన్ సిస్టమ్ స్కోచ్ అవార్డు సొంతం చేసుకున్నాయి.

నిష్పక్షపాతంగా నియామకాలు

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్బీ)' ద్వారా పోలీసు ఉద్యోగాలు అర్హులైనవారికి దక్కుతున్నాయి. తొమ్మిదేండ్లలో 45,800 మంది పోలీసు కొలువులు చేపట్టారు. పోలీస్ ఉద్యోగాల్లో 95 శాతం స్థానికులకే అవకాశాలు కల్పించారు. మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నారు.

'జయ జయహే'కు కీరవాణి సంగీతం చారిత్రక తప్పిదం

- ఇది తెలంగాణ కళాకారులను అవమానించడమే
- తెలంగాణ మ్యూజీషియన్స్ అసోసియేషన్

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : 'జయ జయహే తెలంగాణ...' పాటకు సంగీతాన్ని అందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం పొరుగు రాష్ట్రానికి చెందిన సంగీత దర్శకుడు కీరవాణికి అప్పగించడం చారిత్రక తప్పిదం అవుతుందని తెలంగాణ సినీ మ్యూజీషియన్స్ అసోసియేషన్(టీసీఎంఏ) ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈ మేరకు శనివారం టీసీఎంఏ నేతలు రాష్ట్ర ముఖ్యమంత్రి పేరిట ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ..' గీతాన్ని తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించి విడుదల చేయబోతున్నందుకు తెలంగాణ ప్రజలు, కళాకారులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఇది టీసీఎంఏ గర్విస్తున్న గొప్ప సందర్భమని చెప్పారు. అయితే ఇంతటి గొప్ప గేయాన్ని పాడించే బాధ్యతను, సంగీతాన్ని అందించే బాధ్యతను తెలంగాణ కళాకారులకు కాకుండా పక్క రాష్ట్రం వాళ్లకు అప్పగించడం సరైన నిర్ణయం కాదని లేఖలో ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నిర్ణయం మన తెలంగాణ కళాకారులను అవమానించడమే అవుతుందని సీఎంను ఉద్దేశించి లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిభావంతులైన కళాకారులు ఉన్నారని, ఈ గొప్ప అవకాశాన్ని వారికి ఇస్తారని ఆశిస్తున్నామని తెలిపారు.

ఆ మూడు జిల్లాల్లో వైన్స్‌లు బంద్

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈనెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహిస్తున్నందున ఖమ్మం-వరంగల్-నల్లగొండ జిల్లాల్లో మద్యం అమ్మకాలు నిలిపివేశారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు వైన్స్‌లు బంద్ ఉండనున్నాయి. ఈ మేరకు ఆయా జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెడికల్ సీట్లు మనకే దక్కాలి

- కన్వీనర్ కోటా 100 శాతం వైద్య సీట్లు స్థానికుల హక్కు
- ప్రవేశాల స్థానికతపై స్పష్టత ఇవ్వాలి
- విద్యార్థులు నష్టపోకుండా చూడాలి
- మెడికల్ సీట్ల ప్రవేశాలపై మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తవుతున్నందున వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత అంశంపై సర్కారు స్పష్టత ఇవ్వాలని మాజీ వైద్యారోగ్యశాఖ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లు వందశాతం తెలంగాణ విద్యార్థులకే దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ మూడో వారంలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతున్నందున ప్రభుత్వం తక్షణం స్పందించి స్పష్టత ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని చెప్పారు. లేనిపక్షంలో వైద్య విద్య చదివే అవకాశాలను రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఎక్స్ వేదికగా హరీశ్‌రావు స్పందిస్తూ.. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,900 సీట్లు ఉన్నాయని, ఇందులో 15 శాతం అన్‌రిజర్వుడు కోటా అంటే 280 సీట్లు తెలంగాణ విద్యార్థులు నష్టపోతారని, నిమ్స్ సహా ఇతర మెడికల్ కాలేజీల్లోని దాదాపు 150 పీజీ సీట్లు కోల్పోతారని తెలిపారు. ఎంబీబీఎస్, పీజీ అడ్మిషన్ల ప్రక్రియ సమీపిస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ముఖ్యమైన విషయాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందుతున్నదని, రేవంత్ సర్కారు తీరుతో తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

520 సీట్లు కోల్పోయే ప్రమాదం

రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు 2014 నుంచి కన్వీనర్ కోటాలో 15 శాతం సీట్లకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సైతం పోటీపడే వెసులుబాటు కల్పించారని, ఇదే విధానం కొనసాగితే, 2014 తర్వాత ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీల్లో కూడా 15 శాతం అన్ రిజర్వుడు కోటా కింద దాదాపు 520 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుందని హరీశ్‌రావు హెచ్చరించారు. దీన్ని నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం, అన్ రిజర్వుడు కోటాను పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేసిందని, దీనికోసం, ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్, ఆర్టికల్ 371డీ నిబంధనలకు లోబడి తెలంగాణ స్టేట్ మెడికల్, డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. దీని ప్రకారం, 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేశారని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల తెలంగాణ విద్యార్థులకు 520 మెడికల్ సీట్లు అదనంగా లభించాయని గుర్తుచేశారు. ప్రస్తుతం జూన్ 2తో విభజన చట్టానికి కాలం చెల్లుతుందటంతో పాత మెడికల్ కాలేజీలోని 100 శాతం కన్వీనర్ కోటా సీట్లను కూడా తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు.

నాడు 2,850 సీట్లు.. నేడు 8,340 సీట్లు

తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు చేరువచేయడంతోపాటు రాష్ట్ర విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ప్రారంభించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేరిందని తెలిపారు. తెలంగాణలో నాడు 2,850 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే, ఇప్పుడు 8,340 సీట్లు ఉన్నాయని గుర్తుచేశారు. ఎంబీబీఎస్, పీజీ సహా ఇతర వైద్య విద్య అభ్యసించాలనుకునే తెలంగాణ బిడ్డలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే, స్థానికత అంశంపై రేవంత్ సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ కోటాలోని 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చూడాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని, డాక్టర్ కావాలనుకొనే వైద్య విద్యార్థుల అవకాశాలు మెరుగుపరచాలని సూచించారు.

గొర్రెల పంపిణీకి గుడ్‌బై!

> మూడోపేజీ తరువాయి...

జరిగిన కొన్ని పొరపాట్లు రెండో విడతలో జరగకుండా నాటి ప్రభుత్వం పకడ్బందీగా ఆదేశాలు జారీచేసింది. గొర్రెల యూనిట్ కొనుగోళ్లకు సంబంధించి మొదటి నుంచి చివరి వరకు ఈ-లాబ్ అనే పోర్టల్ (బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా పర్యవేక్షణ చేసేలా ఏర్పాట్లు చేసింది. కొనుగోలు చేసేందుకు వెళ్లిన వాహనాలను జీపీఆర్ఎస్ విధానంతో ట్రాక్ చేయడానికి ఆదేశాలు ఇచ్చింది. అసలు వాహనంలో గొర్రెలు ఉన్నాయా? లేవా? అని ఇతర శాఖల అధికారుల బృందాలతో మార్గమధ్యంలో తనిఖీ చేయించేందుకు నిర్ణయం తీసుకొన్నది. అక్కడితో అగకుండా లబ్ధిదారులు గొర్రెలు కొనుగోలు చేశాక, తన ఇష్టప్రకారంగానే కొన్నామని ఇంటికి వచ్చాక తనకు గొర్రెలు అందాయనే వీడియోను చిత్రించేలా ఆదేశాలు ఇచ్చింది. గతంలో కొనుగోళ్ల బాధ్యతల్లో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్లను తప్పించి జిల్లాస్థాయి అధికారులకు, మండలాల వారీగా బాధ్యతలు అప్పగించింది. ఆ మేరకు రెండో విడతలో లబ్ధిదారులకు కొన్ని యూనిట్లు పంపిణీ చేసింది. ఉదాహరణకు కరీంనగర్ జిల్లాలో 3,404 యూనిట్లకుగానూ 718 యూనిట్లు ఇచ్చింది. మిగిలినవి పంపిణీ చేసే సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావటంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది.

చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వివిధ సామాజిక వర్గాలకు న్యాయం చేస్తామంటూ హామీల వర్షం కురిపించింది. 16వ అంశం కింద.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండో దశ గొర్రెల పంపిణీ చేపడుతామని గొల్లకుర్మలకు హామీ ఇచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో గొల్లకుర్మలు ఆందోళనలు చేపట్టారు. సంబంధిత సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. యూనిట్లు ఎందుకు ఇవ్వటం లేదో చెప్పాలని డిమాండ్ చేశాయి. అయినా అధికారుల నుంచి సమాధానం రాకపోవటంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు వదులుకున్న కొంత మంది కనీసం తమ డబ్బులైనా తిరిగి ఇచ్చేయాలని అడిగారు. ఇదే అదనుగా భావించిన రేవంత్ ప్రభుత్వం.. గత రెండు రోజులుగా డీడీలు చెల్లించిన వ్యక్తుల ఖాతాల్లోనే తిరిగి డబ్బులను జమ చేస్తున్నది. ఉదాహరణకు చూస్తే.. కరీంనగర్ జిల్లాలో 3,404 మంది లబ్ధిదారులు గొర్రెల యూనిట్లకోసం తమ వాటా చెల్లించగా, అందులో 718 మందికి ఇప్పటికే డబ్బులను వెనక్కి ఇచ్చేసింది. మరో 975 మందికి చెల్లింపు కోసం కలెక్టర్ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉన్నది. మిగిలిన వారికి దశలవారీగా పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నది.

మరో పథకానికి ఎగనామం

వడ్లకు రూ.500 బోసన్ ఇస్తామని ముందుగా మ్యానిఫెస్టోలో ప్రకటించి చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు.. గొల్లకుర్మలను కూడా అదే కోవలోకి నెట్టింది. గొర్రెల పంపిణీ పథకానికి ఎగనామం పెట్టినట్టేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రభుత్వం తమ నోట్లో మట్టికొట్టిందని గొల్లకుర్మలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పథకం కొనసాగింపు, రద్దుపై ఒక్క ప్రకటన కూడా చేయకుండా దొంగచాటుగా డీడీలను వాపస్ ఇవ్వటం ఏమిటని మండిపడుతున్నారు.

కాంగ్రెస్ సర్కారుతో ఉపాధి కోల్పోయినం

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గొల్లకుర్మలను బలోపేతం చేసేందుకు గొర్రెల పంపిణీ పథకం తెచ్చిండు. అందులో భాగంగా మొదటి విడతగా చాలామందికి గొర్రెలు ఇచ్చిండు. దానితో ఎందరో జీవనోపాధి పొందిన్రు. రెండో విడత కూడా అందిస్తామని కేసీఆర్ చెప్పిండు. దాంతో లబ్ధిదారుడి వాటా కింద రూ.43,750 ప్రభుత్వానికి జమచేసినం. ఇప్పుడు ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గొర్రెల పంపిణీ పథకం బాగాలేదని, రెండో విడత గొర్రెల పంపిణీ చేయలేమని మంగళవారం అందరి అకౌంట్లో తిరిగి డబ్బులు వేసింది. కాంగ్రెస్ సర్కారుతో ఉపాధి కోల్పోయినం. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మా సమస్యలు చెప్పి న్యాయం చేయాలని కోరినా ఫలితం లేదు.

- పోతరవేణి నర్సయ్య, లబ్ధిదారుడు, నవాబ్‌పేట్

నోటిఫికేషన్లు ఎన్ని ఇచ్చినవ్!

- బీఆర్ఎస్ నియామకాలను మీ ఖాతాలో వేసుకుంటరా?
- కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే నాశనమే
- పట్టభద్రుల్లో మెరుగైన అభ్యర్థి రాకేశ్‌రెడ్డి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి రేవంత్‌రెడ్డి ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో చెప్పాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా వచ్చిన ఉద్యోగాలను తామే ఇచ్చామన్న కాంగ్రెస్ మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శనివారం సూర్యాపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కంపెనీల్లో పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 90 శాతం దొడ్డు వడ్లు పండుతుంటే సన్న వడ్లకే బోనస్ అనడం హాస్యాస్పదమని అన్నారు. సన్న వడ్లకు బయట బోనస్ కంటే ఎక్కువ ధర పలుకుతుంటే ప్రభుత్వానికి ఎలా అమ్ముతారని ప్రశ్నించారు. ఒక్క రూపాయి కూడా బోనస్ ఇచ్చే ఉద్దేశం లేక కాంగ్రెస్ దొంగ డ్రామాలు ఆడుతున్నదని మండిపడ్డారు. 'అభివృద్ధి, సంక్షేమాలు పక్కన పెట్టి సెంటిమెంట్లు, మతం పేరిట ప్రజలను మభ్యపెడుతున్న బీజేపీ ఓ పక్కన ఉండగా.. గత అసెంబ్లీ ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చి ఐదు నెలల్లో ఒక్కటి కూడా అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీ మరో పక్కన ఉన్నది. ఈ రెండు పార్టీలకు ఓటు వేస్తే సర్వనాశనం కావడమే' అని ఆయన పేర్కొన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో బీఆర్ఎస్‌కు చెందిన రాకేశ్‌రెడ్డి మెరుగైన అభ్యర్థి అని అన్నారు. ఎమ్మెల్సీగా మంచి అభ్యర్థిని గెలిపించుకొని చైతన్యాన్ని నిరూపించాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. తెలంగాణను ఆంధ్రాలో కలపాలని కొందరు పిచ్చి కలలు కంటున్నారని, వారి కలలు ఎప్పటికీ నిజం కావని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పె